క్లుప్తంగా

ఆస్తి ధ్రువపత్రాలు ఇవ్వలేదు

సఖినేటిపల్లి: మండలంలోని ఉయ్యూరి వారి మెరక గ్రామంలో బాల గణపతి ఆలయానికి గ్రామానికి చెందిన అన్నదమ్ములు ములికి వీర భద్రరావు, ములికి కోట సత్య సాయిరామ్‌ల ఉమ్మడి ఇంటిని దానంగా ఇస్తున్నట్లు ఎటువంటి రిజిస్టర్ ధ్రువపత్రాలూ తనకు ఇవ్వలేదని ఆలయ కమిటీ అధ్యక్షుడు కందనాల ముత్యాలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోదరుడు వీరభద్రరావు మృతి చెందడంతో ఇద్దరి ఉమ్మడి ఇంటినీ తమ్ముడు కోట సత్యసాయిరామ్ ఆలయానికి రాసిచ్చినట్లు చేసిన ప్రకటన తప్ప, రిజిస్టర్ ధ్రువపత్రాలు ఇవ్వనందున సదురు ఆస్తిపై ఆలయానికి ఎటువంటి సంబంధం లేదని ఆయన అన్నారు.

వైభవంగా గణపతి హోమం

మామిడికుదురు: కొమరాడ–ఈదరాడ గ్రామాల సరిహద్దులో ఉన్న విజయ గణపతి ఆలయంలో మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా గణపతి హోమం, లక్ష గరిక పూజను వైభవంగా జరిపించారు. పండితుల ఆధ్వర్యంలో వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఈ పూజలు ఆద్యంతం ఘనంగా జరిగాయి. పలువురు భక్తులు స్వామిని దర్శించుకుని ముడుపులు, మొక్కులు సమర్పించారు.

సామూహిక అక్షరాభ్యాసాలు



చిన్నారులతో బీజాక్షరాలు దిద్దిస్తున్న ఆలయ ప్రధానార్చకుడు వినాయకరావు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని సన్నిధిలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి విశేషార్చనలు జరిపారు. చిన్నారులకు వారి తల్లిదండ్రులు బీజాక్షరాలు దిద్దించారు. అలాగే అన్నప్రాశనలు, నామకరణలు చేయించారు.

రాయితీపై బస్సు పాసులు

అయినవిల్లి: వివిధ కేటగిరిల్లో ఉన్న దివ్యాంగులకు, వృద్ధులకు ప్రభుత్వం రాయితీపై బస్సుపాసులు అందివ్వనున్నట్లు అమలాపురం ట్రాఫిక్ డిప్యూటీ సూపరింటెండెంట్ జి.సత్యవతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఆధార్‌కార్డు, ఫొటో, రూ.100, సదరం సర్టిఫికెట్ తీసుకురావాల్సి ఉందన్నారు. రాలేని వారికి కూడా వారి సంబంధికులతో పంపించిన బస్సు పాసు ఇస్తామని తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వరుని కల్యాణం

ఆలమూరు: మండలంలోని పినపళ్లలో వేంచేసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. స్థానిక ఆలయం ఆవరణలో వక్కపట్ల ధనేంద్ర ఆధ్వర్యాన గ్రామస్తులు నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో సుమారు 200 మంది దంపతులు పాల్గొని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకీపై దేవతామూర్తుల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. సర్పంచ్ సంగిత సుభాష్, ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభిరామన్న, మాజీ సర్పంచ్ కోట బూరయ్య, వక్కపట్ల లక్ష్మణరావు, చామకూరి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు

పొలంబడితో రైతులకు మేలు

రాజోలు: పొలంబడి నిర్వహణతో రైతులకు మేలు జరుగుతుందని రాజోలు జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ అన్నారు. శుక్రవారం చెన్నడంలో వ్యవసాయశాఖ ఏడీఏ రామ్మోహనరావు ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు వ్యవసాయసాగులో చేపట్టాల్సి సస్యరక్షణలపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే దిశగా పొలంబడి ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని ఏవో మధుకుమార్ తెలిపారు. సర్పంచ్ బడుగు శ్రీనివాసరావు, ఎంపీటీసీ బయ్యా సునీత పాల్గొన్నారు.

గాయపరిచిన వ్యక్తిపై కేసు

అయినవిల్లి: పాత గొడవలు నేపథ్యంలో మహిళను గాయపరిచిన వ్యక్తిపై శుక్రవారం ఎస్సై ఎస్.నాగేశ్వరరావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని మాగాం గ్రామానికి చెందిన బొక్కా వరలక్ష్మిని అదే గ్రామానికి చెందిన గుత్తుల నరేష్ పాత గొడవలు నేపథ్యంలో దాడి చేసి గాయపరిచాడు. దీనిపై బాధితురాలు బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సఖినేటిపల్లి: మండలంలోని మోరి గ్యాస్ కలెక్షన్ స్టేషన్‌కు సమీపాన ప్రధాన రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తలకు తీవ్రగాయాలయ్యాయి. శృంగవరప్పాడుకు చెందిన చొప్పల ప్రవీణ్ యాక్టివా బైక్‌పై గ్రామం నుంచి కేశవదాసుపాలెం వెళుతున్నాడు. ఈ క్రమంలో మోరి జీసీఎస్ వద్దకు వచ్చేసరికి బైక్ స్కిడ్ అయ్యి సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో ప్రవీణ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, బంధువులు హుటాహుటిన కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వర్గాల సమాచారం ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అడపా ఫణిమోహన్ శుక్రవారం చెప్పారు. ఆస్పత్రిలో ప్రవీణ్ చికిత్స పొందుతున్నట్టు, ప్రస్తుతం అతడు కోమాలో ఉన్నట్టు కూడా ఎస్సై అన్నారు.

సంక్షేమ ప్రదాత జగన్‌ను ఆశీర్వదించండి



మాకనపాలెంలో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



ములికిపల్లిలో మహిళకు పథకాల లబ్ధి వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

- ఎమ్మెల్యేలు చిట్టిబాబు, వరప్రసాదరావు
- మాకనపాలెం, ములికిపల్లిల్లో గడప గడపకూ..

మామిడికుదురు: రాష్ట్రంలో సంక్షేమ పథకాలను విస్తృతంగా అమలు చేస్తున్న వైఎస్సార్ సీపీకి ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం మాకనపాలెంలో గడప గడపకూ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల్ని ఎంతో ఆప్యాయంగా పలకరించారు. వారికి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు పంచారు. సంక్షేమ ప్రదాతగా ప్రజల నీరాజనాలందుకుంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మాట తప్పలేదు, మడమ తిప్పలేదు అంటూ జగన్‌ను కీర్తించారు. దేశంలో అన్ని రాష్ట్రాల చూపు మన రాష్ట్రంపై ఉందన్నారు. అటు అభివృద్ధితో పాటు ఇటు సంక్షేమ పథకాలను వెల్లువలా అమలు చేస్తున్న వైఎస్సార్ సీపీకి ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారన్నారు. జగన్ సర్కారుకు ప్రజలు అడగడుగునా అండగా నిలుస్తున్నారని చిట్టిబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, స్థానిక సర్పంచ్ మద్దాల బాబూరావు, ఎంపీటీసీ వలవల పెదబాబు, పీఏసీఎస్ చైర్మన్లు కటకంశెట్టి ఆదిత్యకుమార్, యూవీవీ సత్యనారాయణ, పార్టీ నేతలు కుసుమ శ్రీధర్, పిచ్చుక చిన్న, యాండ్ర వీరాబాబు, భూపతి దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

ములికిపల్లిలో..

రాజోలు: అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం ములికిపల్లిలో గడప గడపకూ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాపాక నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరించారు. ఆయన మాట్లాడుతూ పేదరికమే ప్రామాణికంగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి సంక్షేమ సొమ్ములను ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. గత పాలనలో ప్రభుత్వ పథకాలు పొందాలంటే కొందరు మధ్యవర్తులను ఆశ్రయించవలసి వచ్చేదన్నారు. ప్రస్తుతం వలంటీర్ వ్యవస్థను సీఎం జగన్ తీసుకువచ్చి గ్రామస్థాయిలో సుపరిపాలన అందిస్తున్నారన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, కడలి కపోతేశ్వర ఆలయ చైర్మన్ అరవ జగన్నాథం, మాజీ సర్పంచ్ తాడి సత్యనారాయణ, కంచర్ల శేఖర్, ముద్దాడ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని ప్రజలకు చేరువ చేయాలి

- వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి సాధ్యం
- ఇంటింటికి కన్వీనర్లు, గృహసారథుల సందర్శన



చెముడులంకలో గృహసారథులతో సమీక్షిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పేద, మధ్య తరగతి, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధిని వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కోరారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులదేనన్నారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో గృహసారథుల సమాఖ్య మండలశాఖ అధ్యక్షుడు నామాల శ్రీనివాసు అధ్యక్షతన ఆలమూరు, చెముడులంక గ్రామాల్లోని ఫంక్షన్ హాల్స్‌లో నిర్వహించిన గృహసారథుల అవగాహన సదస్సులో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. మండలంలోని 18 గ్రామాల్లోని 480 మంది వలంటీర్లకు 960 మంది గృహ సారథులను నియమించిన పార్టీ శ్రేణులను ఆయన అభినందించారు. గ్రామ వలంటీర్లకు కేటాయించిన ఇళ్లకు ఆ గ్రామ కన్వీనర్లను, గృహసారథులను ఈనెల పది నుంచి 20 వరకూ సందర్శించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించడంతో పాటు ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని వివరించాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా నూతనగా నియమితులైన గ్రామ కన్వీనర్లు, గృహసారథుల వివరాలను నమోదు చేసుకుని చేపట్టవలసిన బాధ్యతలను ఆయన వివరించారు. పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఎంఏఎంస్ అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్ నేలపూడి లావణ్య, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, ఎంపీటీసీలు ఉన్నమట్ల విజయకుమారి, నెక్కంటి ప్రమీల, పీఏసీఎస్ చైర్మన్లు నెక్కంటి వెంకట్రాయుడు, మోటుపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ల సమస్యల పరిష్కారానికి కృషి

నియోజకవర్గంలో ఎలక్ట్రీషియన్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండల శ్రీస్వశక్తి ఎలక్ట్రీషియన్ల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు స్థానిక ఎస్‌జేఆర్ కల్యాణ మండపం వద్ద ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్మిక భవనం నిర్మించుకునేందుకు వీలుగా స్థలం కేటాయించాలని అభ్యర్థించారు. సమస్యలను సానుకూలంగా విన్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి పరిష్కారానికి హామీ ఇచ్చారు. అనంతరం ఆయనకు పూలమాల వేసి సత్కరించారు. సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీతకు సత్కారం



ఆలమూరులో అవార్డు గ్రహీత సర్పంచ్ తమ్మనను ఘనంగా సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: మండల ఉత్తమ సర్పంచ్ సేవా పురస్కారం అవార్డు గ్రహీత, చెముడులంక సర్పంచ్ తమ్మన శ్రీనివాసుకు శుక్రవారం ఘన సత్కారం జరిగింది. ఆలమూరు, చెముడులంక గ్రామాల్లో గురువారం నిర్వహించి గృహ సారథుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైనఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు ఈ సన్మానాన్ని నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణపై మెరుగైన పనితీరు, అభివృద్ధిలో గ్రామాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దిన సర్పంచ్ తమ్మనను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కొనియాడారు. అనంతరం అవార్డు గ్రహీత తమ్మనకు దుశ్శాలువ, పూలమాల వేసి సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

సత్యమోహన్‌కు సన్మానం



సత్యమోహన్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

అంబాజీపేట: జగనన్న సచివాలయ, గృహ సారథేల (జేసీఎస్) మండల ఇన్‌చార్జిగా దొమ్మేటి సత్య మోహన్ నియమితులు కావడంతో మండల వైఎస్సార్ సీపీ నాయకులు అంబాజీపేటలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. జేసీఎస్ నియామక ఉత్తర్వులు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చేతుల మీదుగా అందుకున్నట్లు సత్య మోహన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, సూదాబత్తుల రాము, ఉందుర్తి నాగబాబు, కుసుమ శ్రీను, అప్పన శ్రీను, గంటి శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు,

మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రమీలారాణి

రాజోలు: ఈనెల 11న రాజోలు కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీలారాణి పిలుపునిచ్చారు. శుక్రవారం రాజోలు కోర్టు కాంప్లెక్స్‌లో పోలీస్ శాఖ, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి ప్రమీలరాణి మాట్లాడుతూ రాజీకి ఆమోదయోగ్యమైన కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. జూనియర్ సివిల్ జడ్జి జి.సురేష్ బాబు, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రమేష్ పాల్గొన్నారు.

సంపూర్ణ పరిహారం అందించేందుకు చర్యలు



మలికిపురంలో భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ వసంతరాయుడు

మలికిపురం: జాతీయ రహదారి భూసేకరణలో భూములు తీసుకున్న రైతులకు, యజమానులకు అందరికీ సంపూర్ణ పరిహారం అందేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అమలాపురం ఆర్డీఓ వసంతరాయుడు పేర్కొన్నారు. 216 హైవే బైపాస్ కోసం జరుగుతున్న భూసేకరణను శుక్రవారం ఆయన పరిశీలించారు. మండలంలోని రామరాజులంక, గుడిమెళ్లంక, మలికిపురం, దిండి గ్రామాల మీదుగా సఖినేటిపల్లి మండలం రామేశ్వరం వరకూ ఈ జాతీయ రహదారి నిర్మాణం కొత్తగా జరుగుతుంది. ఇందుకు భూసేకరణ చురుకుగా సాగుతుంది. ఈ గ్రామాల్లో 22 ఎకరాలకు పైగా భూమి సేకరిస్తున్నట్లు ఆయన చెప్పారు. మూడు ఇళ్లు తొలగించాల్సి వస్తుందన్నారు. తహసీల్దార్ వీవీ నరసింహారావు, వీఆర్వో హరికిషన్, నాయకులు గెడ్డం తులసీ భాస్కరరావు తదితరులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగించుకోండి

అయినవిల్లి: ప్రభుత్వ అనుబంధ విద్యాసంస్థలో చేరి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహకాలను, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని ముక్తేశ్వరం ఎస్ఎస్‌వీఆర్ ప్రిన్సిపాల్ దేవరపు శ్రీనివాసరావు విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. శుక్రవారం ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మండలంలోని వీరవల్లిపాలెం, శానపల్లిలంక, మూలపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఉన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

అంబాజీపేట: ఉపాధిహామీలో భాగంగా కొబ్బరిచెట్లకు పళ్లాలు, పంట కాలువలో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఏపీఓ అడపా వెంకటకృష్ణ తెలిపారు. గంగలకుర్రు, మాచవరం, నందంపూడి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 57 పనులకుగాను 1027 మంది ఉపాధి కూలీలు చేస్తున్నారన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

మామిడికుదురు: బి.దొడ్డవరంలో సిమెంట్ కాంక్రీట్ రోడ్డుకు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శుక్రవారం భూమి పూజ చేశారు. ఆర్అండ్‌బీ రోడ్డు ఆధునీకరణలో భాగంగా రోడ్డు వెడల్పు చేసి పక్కా సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చెల్లుబోయిన రామశివ సుబ్రహ్మణ్యం, పార్టీ నేతలు కాండ్రేగుల శ్రీనివాస్, వాకపల్లి వీరాస్వామి పాల్గొన్నారు.

కొబ్బరి బోర్డు ఏర్పాటు కోరుతూ వినతి

కొబ్బరి దింపు, ఒలుపు కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్రంలో 111 గ్రామ సంఘాల్లో 7,531 మంది సభ్యులుగా ఉన్నారని చెప్పారు. వీరు గ్రామ సంఘాలుగా ఏర్పడి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ప్రత్యేక కొబ్బరి బోర్డు ఏర్పాటు చేసి దాని ద్వారా 50 ఏళ్లు దాటిన కార్మికులకు పింఛన్‌తో పాటు ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో సంఘం ప్రతినిధులు సిర్రా శ్రీనివాసరావు, గుబ్బల కృష్ణ, గంజి అనంతం, కడలి సత్యనారాయణ, గుబ్బల శ్రీరాములు ఉన్నారు.

బీచ్ వద్ద ఏర్పాట్ల పరిశీలన

సఖినేటిపల్లి: అంతర్వేది తీర్థమహోత్సవాల్లో ఈ నెల 5న మాఘ పౌర్ణమి సందర్భంగా సముద్రం వద్ద బీచ్‌లోను, వసంత మండపం వద్ద ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎస్సై అడపా ఫణిమోహన్ కలసి పరిశీలించారు. ప్రధానంగా బీచ్ వద్ద సముద్రంలో స్వామిని స్నానం చేయించే ఘట్టంలోను, అనంతరం స్వామి సేదతీరే వసంత మండపం వద్ద ఏర్పాట్లను వారు పరిశీలించారు. అలాగే ఒడ్డున మహిళలు దుస్తులు మార్చుకునే గదుల ఏర్పాటుపై కూడా వారు సమీక్షించారు.

పుంగనూరు గోమాతకు అంత్యక్రియలు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో మృతి చెందిన పుంగనూరు జాతి ఆవు(21)కు హిందూ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు జరిగాయి. గ్రామానికి చెందిన పశుపోషకుడు రెడ్డి సత్తిబాబు గత కొన్నేళ్ల క్రితం పుంగనూరు ఆవును కొనుగోలు చేశాడు. ఆ పుంగనూరు ఆవు ఇప్పటి వరకూ సుమారు 14 సార్లు గర్భం దాల్చి దూడలకు జన్మనిచ్చింది. ప్రస్తుతం ఆ ఆవు మరోసారి గర్భం దాల్చి వారం రోజుల్లో పండంటి ఆవు దూడకు జన్మనివ్వవలసి ఉంది. అంతలో అనారోగ్యానికి గురైన శుక్రవారం మృతి చెందింది. ఈ ఆవుతో పాటు తనకు జన్మించిన దూడలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జరిగిన అనేక పుంగనూరు అందాల, పాల పోటీల్లో అవార్డులు సాధించి గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చాయి. అలాంటి ఆవు మృతి చెందడంతో ఆవేదన చెందిన రైతు సత్తిబాబు తనకున్న ప్రేమను చాటేందుకు నిర్ణయించుకున్నాడు. దీంతో రైతు సత్తిబాబు తన వ్యవసాయక్షేత్రంలో సర్పంచ్ గుణ్ణం రాంబాబు, ఎంపీటీసీ యార్లగడ్డ రమేష్‌తో కలసి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు.


మైనార్టీ సంక్షేమ కమిటీ సభ్యుడిగా పాపఫ్

అంబాజీపేట: మైనార్టీ సంక్షేమానికి ప్రధాని 15 నూతన పాయింట్ల ప్రోగ్రాం కమిటీ సభ్యుడిగా అంబాజీపేటకు చెందిన సీపీహెచ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ జల్లి జార్జి పాపఫ్ నియమితులయ్యారు. స్థానిక హడ్కోకాలనీలో ఉన్న కల్వరి క్రైస్తవ ప్రార్థన మందిరంలో జార్జి పాపఫ్‌ను మైనార్టీ సంక్షేమ కమిటీ సభ్యుడిగా నియమించడంపై శుక్రవారం సన్మాన సభ నిర్వహించారు. జార్జి పాపఫ్ మాట్లాడుతూ తనను మైనార్టీస్ ఇంప్లిమెంటేషన్, డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడిగా నియమించినందుకు మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే చిట్టిబాబు, కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు, సంఘస్తులు తదితరులు పాల్గొని పాపఫ్ దంపతులను సత్కరించారు.

సివిల్స్‌లో అర్హత సాధించలేదని యువకుడు ఆత్మహత్య

జీడిమెట్ల: సివిల్స్‌లో అర్హత సాధించలేకపోయాయని ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ఎం.పవన్ వివరాల ప్రకారం కోనసీమ జిల్లా మానేపల్లికి చెందిన నాగేంద్రుడి కుమారుడు కార్తిక్ (24) గత కొన్ని నెలల క్రితం సివిల్స్ కోచింగ్ కోసం నగరానికి వచ్చి అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో పాటు గదిలో ఉంటున్నాడు. ప్రతిరోజు ఓ కోచింగ్ సెంటర్‌కు వెళ్లి క్లాసులకు హాజరయ్యేవాడు. ఇటీవల కార్తిక్‌కు ఆర్థిక ఇబ్బందులు రావడంతో ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగం నచ్చకపోవడంతో కొన్ని రోజులకే మానేశాడు. జీవితంలో అనుకున్న లక్ష్యం నెరవేరలేదని ఎన్నో నెలల నుంచి సివిల్స్ కోసం సన్నద్ధమైన అర్హత సాధించలేదని స్నేహితుల వద్ద చెప్పుకుని బాధపడేవాడు. గురువారం శ్రీనివాస్ బయటకు వెళ్లగా కార్తిక్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. శ్రీనివాస్ తిరిగి రాత్రి 10.30 గంటలకు వచ్చి చూడగా కార్తిక్ గదిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. కార్తిక్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పశువులకూ ఆధునిక వైద్యం



మలికిపురంలో సంచార పశు వైద్య సేవా వాహనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: రాష్ట్రంలో పశు సంపదను కాపాడుకోవడమే లక్ష్యంగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. శుక్రవారం మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు కొత్తగా మంజూరైన సంచార పశు వైద్య సేవా వాహనాన్ని మలికిపురంలో ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. స్వయంగా వాహనాన్ని నడిపి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ వాహనాలు గ్రామాల్లో పాడి రైతులకు ఎంతగానో మేలు చేస్తాయన్నారు. తద్వారా పశువుల ఆరోగ్యం కాపాడడంతో పాటు పశుసంపద పెరగడానికి దోహదం చేస్తాయన్నారు. పశువులకు సైతం ఆధునిక వైద్యం అందుబాటులోకి తెచ్చిన ఘనత మన ప్రభుత్వానిదేనన్నారు. పశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రమాదాల సమయంలో కూడా 1962 నంబర్‌కు రైతులు ఫోన్ చేస్తే వెంటనే ఈ వాహనం అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు బల్ల ప్రసన్న కుమారి, దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మీ మంగతాయారు, గుబ్బల రమేష్, నల్లి శివకుమార్, మేడిచర్ల రావు, కోళ్ల వేణుప్రసాద్, రొక్కాల వెంకట్, వెల్లా పాండురంగారావు, పశువైద్యులు బి.శివకుమార్, ఎంవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలం

మామిడికుదురు: రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం శుక్రవారం మామిడికుదురులో జరిగింది. దీనిలో భాగంగా స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనం ప్రాంగణంలో జరిగిన సమావేశంలో సూర్యారావు మాట్లాడారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. సామాన్యుడి జీవనం దుర్భరంగా మారిందని వాపోయారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

కళా తపస్వితో అనుబంధం అజరామరం

శాస్త్రీయ కళలను కథలుగా మలుచుకుని.. శిల్పి వుడయార్

కొత్తపేట: భారతీయ సంస్కృతికి చిహ్నమైన శాస్త్రీయ కళలను తన కథలుగా మలుచుకుని, అద్భుతమైన చిత్ర కావ్యాలను తెరకెక్కించి, కళాతపస్విగా పేరొందిన కె.విశ్వనాథ్ మృతి కళా ప్రపంచానికి తీరని లోటని ప్రముఖ అంతర్జాతీయ శిల్పి, శ్రీనాథరత్న శిల్పి వుడయార్ శిల్పకళా సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు డి.రాజ్‌కుమార్ వుడయార్ అన్నారు. విశ్వనాథ్ మృతికి వుడయార్ విచారం వ్యక్తం చేశారు. ఆయనతో తనకు మంచి సాన్నిహిత్యం ఉందన్నారు. వివిధ సందర్భాలను పురస్కరించుకుని ఆయా వేదికలపై కలుసుకోవడంతో పాటు వ్యక్తిగతంగా కూడా పలుమార్లు కలిశానన్నారు. ముఖ్యంగా సుమారు పదేళ్ల క్రితం తాను రూపొందించిన ప్రముఖ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు కాంస్య విగ్రహం కాకినాడలో ఆవిష్కరణ సందర్భంగా జరిగిన భారీ బహిరంగ సభా వేదికపై పలువురు ప్రముఖులు, చట్టసభల ప్రతినిధుల సమక్షంలో కె.విశ్వనాథ్ చేతుల మీదుగా ఘన సన్మానం మరచిపోలేని అనుభూతి అని గుర్తు చేసుకున్నారు.

విశ్వనాథ్ చిత్రాలు చరిత్రలో కళాఖండాలు: షేక్‌గౌస్

కళాతపస్వి కె.విశ్వనాథ్ దర్శకత్వంలో తీసిన సినిమాలు చరిత్రలో కళా ఖండాలుగా నిలిచిపోయాయని కొత్తపేట కళా సాహితీ సభ్యుడు షేక్ గౌస్ అన్నారు. కొత్తపేటలో తన వ్యాపార సంస్థ వద్ద విశ్వనాథ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. తాను ఆయనకు వీరాభిమానినని, పలుమార్లు విశ్వనాథ్ ఇంటికి వెళ్లి కలిశానన్నారు. ఆయన గొప్ప జ్ఞాని అని, జ్ఞాపకశక్తి ఎక్కువన్నారు. సుమారు 25 ఏళ్ల క్రితం కొత్తపేట పరిసరాల్లో తీసిన సినిమాలు, జరిగిన విషయాలు, సన్మానాలు గుర్తున్నాయన్నారు. ఇటీవల చివరగా కలిసినప్పుడు వయసురీత్యా తగ్గినా మానసికంగా ఎంతో దృఢంగా ఉన్నారన్నారు. ఎంతో మర్యాదగా కూర్చోబెట్టి చక్కగా మాట్లాడారన్నారు. విశ్వనాథ్ మృతి సినీరంగానికి, తెలుగు వారికి తీరనిలోటని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



కె.విశ్వనాథ్‌ను సత్కరిస్తున్న రమణరాజు తదితరులు

కె.విశ్వనాథ్‌కు ఆత్రేయపురం మండలంతో విడదీయలేని అనుబంధం

ఆత్రేయపురం: కళాతపస్విగా పేరొందిన కె.విశ్వనాథ్ గురువారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయనకు ఆత్రేయపురం మండలంలో విడదీయలేని అనుబంధం. లొల్లలాకుల వద్ద పలు చిత్రాల్లో నటించారు. ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ నిర్మాత, ప్రముఖ పారిశ్రామిక వేత్త పాతపాటి వెంకట సత్యనారాయణరాజు (రమణరాజు), వేగిరాజు సుబ్బరాజు ఆయన్ను ఘనంగా సత్కరించారు.